క్లుప్తంగా

పరీక్షా కేంద్రం తనిఖీ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పీజీ ప్రథమ సంవత్సరం పరీక్షలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తనిఖీ చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి పరీక్షలను పరిశీలించారు. పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆదేశించారు.

డైరీ ఆవిష్కరణ



జీసీటీఏ సంఘ డైరీ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: ప్రభుత్వ కళాశాలల అధ్యాపక సంఘం (జీసీటీఏ) డైరీని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించడంలో జీసీటీఏ ముఖ్యపాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో జీసీటీఏ నాయకులు జి. విజయలక్ష్మి, ఎం. వీరభద్రయ్య, షాజియాబేగం తదితరులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహించిన వలంటీర్లు



అలంఖాన్‌పల్లె స్పెషల్ క్యాంపులో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిరుద్యోగ యువతపై సర్వే చేపట్టారు. కడప నగర పరిధిలోని అలంఖాన్‌పల్లెలో నిర్వహించిన స్పెషల్ క్యాంపులో భాగంగా చేపట్టిన ఈ సర్వేలో వలంటీర్లు గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వి. రమాదేవి, ఉదయప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘన సన్మానం




కె. సురేష్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్‌గా నియమితులైన కడప మేయర్ కె.సురేష్‌బాబును వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సోమవారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో ఆయనకు శాలువా కప్పి, మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తనకు రెండోసారి యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఆయన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం. సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాలక్రిష్టారెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రామక్రిష్ణ, దత్తసాయి, అర్జున్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నివారించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో విద్యుత్ కోతలను నివారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ కోతలను నివారించాలని విద్యుత్ ఎస్ఈ రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరెంటు కోతలతో పంటలు ఎండుతున్నాయని తెలిపారు. జిల్లాలో ఉద్యాన వన పంటలు అరటి, ఆకుతోటలు, చీనీ, బొప్పాయి, నువ్వు , వేరుశనగ, వరి పంటలు బోర్ల కింద సాగు చేశారని కరెంటు కోతలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు చిన్న సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు



ఎల్లారెడ్డిపల్లె సచివాలయం పక్కనే ఉన్న కంపచెట్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కమలాపురం : మండలంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తన సొంత నిధులతో రెండు జేసీబీలు ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించారు. సోమవారం మండల పరిధిలోని ఎల్లారెడ్డిపల్లె, ననంతపురం గ్రామాలలో, అలాగే కమలాపురం పట్టణంలోని అక్కానగర్‌కు వెళ్లే రహదారిలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించారు. ఆయా గ్రామాల్లో రహదారుల వెంబడి కంపచెట్లు అడ్డంగా ఉన్నాయని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే రెండు జేసీబీలు ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగిస్తున్నారు. ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే పీఏ కిషోర్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ ఆదర్శనీయం



వలంటీర్లకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశానికి హాజరైన వలంటీర్లు, సచివాలయ సెక్రటరీలు

- గ్రామ, వార్డు సచివాలయ సేవలతో నూతన ఒరవడి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష
- వలంటీర్ల ఉత్తమ ప్రతిభకు పురస్కారాలు

కడప కార్పొరేషన్ : గ్రామ, వార్డు సచివాలయ సేవలతో ప్రభుత్వం పరిపాలనలో నూతన ఒరవడి సృష్టించిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి అంజాద్ బాష అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్‌లో మున్సిపల్ పరిధిలో సచివాలయ వార్డు వలంటీర్ల సేవా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ ,వార్డు సచివాలయ వ్యవస్థను మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చామన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల గడపకు చేరుస్తున్న మానవతా మూర్తులు వలంటీర్లని కొనియాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులందరికీ అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రతి నెల 1 వ తేది తెల్లవారక మునుపే తలుపు తట్టి అవ్వాతాతలకు పింఛన్ అందజేస్తున్నారన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు సైనికుల్లా పనిచేసి మెరుగైన సేవలందించారని గుర్తు చేశారు. రాబోయే రోజులలో వలంటీర్లు బాగా పనిచేసి రాష్ట్రానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. ప్రతిభ చూపిన వలంటీర్లను గుర్తించిన ప్రభుత్వం సేవా మిత్ర, సేవ రత్న, సేవా వజ్ర పేర్లతో సత్కరిస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వలంటీర్ల మీద పెట్టుకున్న నమ్మకాలను వమ్ము చేయకుండా మరింత కష్టించి పని చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరికీ అర్థం అయ్యేలా వివరించాలన్నారు. వైఎస్ జగన్ లాంటి ముఖ్యమంత్రి కలకాలం వుంటే రాష్ట్రంలో పేదరికమే ఉండదన్నారు. డిప్యూటీ మేయర్స్ బండి నిత్యానందరెడ్డి, ముంతాజ్ బేగంలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన నాటి నుండి పేద ప్రజల అభ్యున్నతికి నవ రత్నాల రూపంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, వాటిని సచివాలయ గ్రామ వార్డు వలంటీర్ ల ద్వారా అందజేస్తున్నారన్నారు. అనంతరం ప్రజలకు సేవలందించడంలో ప్రతిభ చూపిన ఆయా వార్డులకు సంబంధించి 5 మందికి సేవ వజ్ర, 15 మందికి సేవా రత్న, 1596 మందికి సేవా మిత్ర పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాకేష్ చంద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, కార్పొరేటర్లు కె.సూర్యనారాయణరావు, పాకా సురేష్, చెన్నయ్య, షఫీ, అజ్మతుల్లా, ఆరీఫుల్లా బాషా, షంషీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌బి అహ్మద్‌బాషా, ఎన్. సుబ్బారెడ్డి, సీహెచ్ వినోద్, జమాల్‌వలీ, మియ్యా తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ప్రతి సోమవారం ప్రజలు ఇచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ ఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం స్థానిక కడప నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కార్పొరేషన్ శాఖధిపతులు, అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 87 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి–16, టౌన్‌ప్లానింగ్–14, రెవెన్యూ–7, హెల్త్ విభాగం–4, యూసీడీ విభాగం–2, కడప తహసీల్దార్–3, సచివాలయం విభాగం–5, హౌసింగ్‌కు సంబంధించి ఒక అర్జీ వచ్చాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి తగు పరిష్కారం చూపాలని ఆయన అధికారులకు సూచించారు.

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలి..

కడప నగరంలోని పుట్లంపల్లి, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఉక్కాయపల్లె, వినాయక నగర్ వద్ద నిర్మిస్తున్న గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన ఆయా స్టేషన్లను పరిశీలించి అధికారులు, కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రతి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పది టన్నుల మైక్రో కంపోస్టు ఎరువు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

22 న శ్రీ శ్యామలా మాతాంగీదేవి విగ్రహ ప్రతిష్ట

చెన్నూరు : చెన్నూరు మండల పరిధిలోని పుష్పగిరి రోడ్డులో గల కాశీపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్యామలా మాతాంగీదేవి ఆలయంలో ఈ నెల 22 వ తేదీన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బోలా వెంకట సుబ్బయ్య, సుధాకర్, రవి కుమార్ , మల్లేశ్వర్ రెడ్డి, శివ శంకర్, వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 10–39 గంటలకు పుష్పగిరి పీఠాధిపతి శ్రీ విద్యా శంకర భారతి స్వామి చేతుల మీదుగా శ్రీ శ్యామలా మాతాంగీ దేవి యంత్ర, విగ్రహ ప్రతిష్ట జరుగుతుందని తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

బండలాగుడు పోటీలు..

ఉత్సవాల్లో భాగంగా 22 న న్యూ కేటగిరి విభాగం వృషభ రాజములచే జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు జరుగుతాయని తెలిపారు. మొదటి బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

జేబీవీఎస్ సేవలు ఎనలేనివి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

కడపకోటిరెడ్డిసర్కిల్ : కొత్తగా ఆలోచిస్తూ అనేక సేవాకార్యక్రమాలు చేపడుతున్న జేబీవీఎస్ దిప్రెసెర్వర్ సేవా సమితి ఆర్గనైజేషన్ సేవలు ఎనలేనివని నెహ్రూ యువకేంద్రం జిల్లా ప్రతినిధి మణికంఠ తెలిపారు. స్థానిక శ్రీహరి డిగ్రీ కళాశాలలో సోమవారం జేబీవీఎస్ దిప్రెసెర్వర్ సేవాసమితి ప్రథమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జేబీవీఎస్ దిప్రెసెర్వర్ సేవా సమితి ఒక ఏడాదిలో 750 మంది యువతతో రక్తదానం చేయించడం గొప్ప విషయమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చెన్నకేశవ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎన్ఎస్ఎస్ వలంటీర్ అశోక్ మాట్లాడారు. ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రథమ బహుమతిని భరత్‌రెడ్డి, ద్వితీయ బహుమతి మనోహర్ అందుకున్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఎస్‌ప్రేఓ ఆనంద్‌కుమార్, సంస్థ సభ్యులు ఆయేషా, మహిమ, సల్మాన్, సోహెబ్, అశోక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్ట్స్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల స్నాతకోత్సవం ఈనెల 21వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, విద్యాశాఖ కమిషనర్ డా. పోలా భాస్కర్ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. 2022–23 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు కళాశాల పరీక్షల విభాగంలో వారిపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీ తనిఖీ



వైద్య పరికరాన్ని తనిఖీ చేస్తున్న ఏఎంఓ

ఒంటిమిట్ట: మండలంలోని పీహెచ్‌సీని సోమవారం ఏఎంఓ జి.వెంకటరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని ల్యాబ్‌లను పరిశీలించి, అనంతరం ఒంటిమిట్టలో మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి మురుగునీరుకు తొలగించి, దోమల ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ ఈ.మీరాప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రయాణికులకు, ప్రజలకు, విద్యార్థులకు ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా కరపత్రాలు పంచుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఓ మురళీధర్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, లక్ష్మీ ప్రసన్న, శివ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఈడీ స్క్రీన్‌ల పరిశీలన



ఎల్‌ఈడీల ఏర్పాటును పరిశీలిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని సమావేశ మందిరాల్లో అధునాతన ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ఏర్పాట్లను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పరిశీలించారు. విశ్వవిద్యాలయంలోని ప్రధాన పరిపాలన భవనంలోని తాళ్లపాక అన్నమాచార్య సెనెట్ హాల్‌లో, ఆర్ట్స్‌బ్లాక్‌లోని సురభి సమావేశ మందిరంలో 10 అడుగుల పొడవు, ఆరు అడుగుల వెడల్పు కలిగిన ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. సమావేశ మందిరాలలో సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సింపోజియంలు, సదస్సుల నిర్వహణలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఉపయోగకరం కానున్నాయి. వీసీ వెంట రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ప్రధాన ఇంజినీర్ రాజశేఖరరెడ్డి, డీఈ రామచంద్రారెడ్డి ఉన్నారు.

వైద్యం వెంకటేశ్వరాచార్యులకు 'భూతపురి' అవార్డు

కడప కల్చరల్ : మహా కవి శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అవార్డును ఈ నెల 25న ప్రసిద్ధ కవి, విమర్శకులు వైద్యం వెంకటేశ్వరాచార్యులకు మెమోరియల్ ట్రస్ట్, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం ఆధ్వర్యంలో అందజేయనున్నట్లు అధ్యక్షులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, కార్యదర్శి డాక్టర్ భూతపురి శివరామ సురేంద్ర శర్మ తెలిపారు.

ఉదయం 10 గంటలకు సీపీ బ్రౌన్ భాష పరిశోధన కేంద్రంలో జరగనున్న ఈ కార్యక్రమానికి డాక్టర్ వై.యస్.ఆర్. ఆర్కిటెక్చర్ – ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయ ప్రసాద్ హాజరవుతారని, యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు. విశిష్ట అతిథిగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద రెడ్డి, ప్రధానవక్తగా సాహితీవేత్త – తెలుగు పండితులు బి.రాజశేఖర్, ఆత్మీయ అతిథులుగా విశ్రాంత హిందీ పండితులు ఎ.రామ సుబ్బారెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ కె.గోపీనాథ్, సంస్కృత ఉపన్యాసకురాలు డాక్టర్ వై.నాగేంద్రమ్మ పాల్గొంటారన్నారు.

మార్కెట్ యార్డులో హమాలీల ధర్నా



మార్కెట్ యార్డులోని సెక్రటరీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

కడప అగ్రికల్చర్: కడప మార్కెట్‌యార్డులో సోమవారం ఉదయం హమాలీలు ధర్నా నిర్వహించారు. మార్కెట్‌యార్డులో మౌలిక వసతులైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేదని యార్డులోని సెక్రటరీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా హమాలీలు మాట్లాడుతూ రోజంతా పనిచేసే తమకు ఈ రెండు మౌలిక వసతులు కూడా లేకుంటే ఎలా అని ప్రశ్నించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకుని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కార్యాలయ సిబ్బంది కల్పించుకుని సంబంధిత సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నా విరమించారు.

శ్రీ వేంకటరమణ గోవిందా.. గోవిందా



సింహవాహనంపై శ్రీ వేంకటరమణుడు



ముత్యపు పందిరి వాహనంపై శ్రీవేంకటరమణస్వామి

పులివెందుల టౌన్ : మము కరుణించరావా శ్రీ వేంకటరమణ గోవిందా.. గోవిందా అంటూ భక్తులు స్వామివారిని ఆరాధించారు. పట్టణంలో వెలసిన శ్రీవేంకటరమణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు సోమవారం ఉదయం శ్రీవారు సింహ వాహనంపై దర్శనమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించి స్వామి వారికి పట్టు పీతాంబరాలను సమర్పించి విశేష పూజ లు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం సతీసమేతుడై స్వామివారు ముత్యపు పందిరి వాహనంలో పురవీధులలో జయజయ ధ్వానాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు ఊరేగుతుంటే భక్తులు అడుగడుగునా నీరాజనాలు అర్పించారు. శ్రీ వేంకటరమణుడు రాకతో పురవీధులు పులకించాయి. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చన, నివేదన, నిత్య హోమం , కలశారాధన, ఇత్యాది కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు నిర్వహించారు. ఉభయదారులతో పూజలు నిర్వహించారు.

సిద్దవటంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం

సిద్దవటం : ఆర్‌బీఐ ఆదేశాల మేరకు వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సిద్దవటంలో ప్రారంభించామని సిద్దవటం ఎస్‌బీఐ మేనేజర్ డేవిడ్‌రాజు, ఏపీజీబీ మేనేజర్ గంగాదేవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం, రాజంపేట, చింతకొమ్మదిన్నె మండలాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలకు ఆర్థిక పరమైనటువంటి అభివృద్ధి కోసం ప్రణాళిక క్రమములు తెలియజేస్తూ ఆర్థిక లావాదేవిలు జరుపుటకు ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించుటకు ప్రభుత్వం రంగ బ్యాంకులు ఎంతగానో తోడ్పతున్నాయన్నారు. ఈ బ్యాంకుల సేవల ద్వారా ప్రజలకు ఆర్థిక లావాదేవిలు మెరుగుపరుచుటకు బ్యాంకుల ద్వారా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

తెగుళ్లతో దెబ్బతింటున్న నువ్వుల పంట

- రబీలో విస్తారంగా నువ్వుల సాగు
- సాగులో దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు
- ఆందోళనలో నువ్వుల సాగు రైతులు



వేములలో సాగు చేసిన నువ్వుల పంట

వేముల : ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లు రైతులకు కలిసి రావడంలేదు. ఖరీఫ్ సాగుకు సకాలంలో వర్షాలులేక పంటలు సాగు కాలేదు. ఆలస్యంగా కురిసిన వర్షాలకు పంటలు సాగు చేసినా ఆశించిన మేర దిగుబడులు లేక రైతులు నష్టాలను చవిచూశారు. ఖరీఫ్‌లో నష్టపోయినా రబీలోనైనా పంటల సాగులో దిగుబడులు ఉంటాయని ఆశించిన రైతులకు నిరాశే మిగులుతోంది. రబీ సీజన్‌లో అదునులో వర్షాలు లేవు. అదును దాటిన వర్షాలతో నువ్వులు, పెసర పంటలను సాగు చేసుకున్నారు. నువ్వుల పంటకు విపరీతమైన తెగుళ్ల సోకాయి. పంట సాగు చేసిన 20 రోజుల నుంచే తెగుళ్ల సోకడం ప్రారంభమైంది. దీంతో రైతులు తెగుళ్ల నివారణకు మందులను పిచికారి చేస్తూ వచ్చారు. అయినా తెగుళ్ల అదుపులోకి రాలేదు. పంటకు తెగుళ్ల వీడక దెబ్బతింటుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

ఎకరాకు రూ.15 వేలకుపైనే పెట్టుబడులు :

నువ్వుల పంటల సాగులో రైతులు పెట్టుబడులు ఎక్కువగానే అయ్యాయి. ఎకరాకు రూ.15 వేలకు పైనే పెట్టుబడులు పెట్టినట్లు రైతులు అంటున్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు ఉంటాయని రైతులు నువ్వుల పంట సాగుపై ఆసక్తి చూపారు. పంట సాగు చేశాక వాతావరణ మార్పులతో తెగుళ్ల సోకడంతో పెట్టుబడులు పెరిగిపోయాయని రైతులు చెబుతున్నారు. పంటకు ఎక్కువగా బూడిద, నల్ల తెగులు సోకాయి. దీంతో పంట దెబ్బతింది.

విస్తారంగా నువ్వుల సాగు :

పులివెందుల నియోజకవర్గంలో విస్తారంగా నువ్వుల పంటను రైతులు సాగు చేసుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8వేల ఎకరాలలో నువ్వుల పంట సాగైందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రబీలో అదును దాటిన వర్షాలు పడకపోవడంతో ప్రత్యామ్నాయ పంటగా రైతులు నువ్వుల పంటను ఎంచుకున్నారు. నియోజకవర్గంలోనే వేముల మండలంలో అత్యధికంగా నువ్వుల పంట సాగైంది. మండల వ్యాప్తంగా 2 వేల ఎకరాలలో నువ్వుల పంట సాగైంది. వ్యవసాయ బోర్లు, వర్షాధారం కింద పంటను సాగు చేసుకున్నారు.

తెగుళ్లతో దెబ్బతింటున్న పంట :

ఈ ఏడాది రబీలో సాగు చేసిన నువ్వుల పంట తెగుళ్లకు దెబ్బతింది. పంట సాగు చేసి 70 రోజులు దాటింది. మరో 10 రోజులలో పంట చేతికొస్తుంది. ఇప్పటికే నాలుగుసార్లు తెగుళ్ల నివారణకు మందులను స్ప్రే చేశారు. అయినా తెగుళ్ల వీడకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కసారి మందులు స్ప్రే చేస్తే ఎకరాకు మందు, కూలీ ఖర్చులు కలుపుకుని రూ.1000లు ఖర్చు చేస్తున్నారు. దీంతో రైతులకు సాగులో అదనంగా పెట్టుబడులు అవుతున్నాయి. పెట్టుబడులు తక్కువని పంట సాగు చేస్తే తెగుళ్లతో పంట దెబ్బతినడంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.

దిగుబడులపై తెగుళ్ల తీవ్ర ప్రభావం :

నువ్వుల పంటలో తెగుళ్ల దిగుబడులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. నువ్వుల పంట సాగు చేసిన 80 రోజులకు దిగుబడులు వస్తాయి. ఇప్పటికే 70 రోజులు దాటిపోవడంతో మరో 10 రోజులలో పంట కోతకు వస్తుందని రైతులు అంటున్నారు. తెగుళ్లతో పంటను వదులుకోవాల్సి వస్తుందని కొంతమంది రైతులు అంటున్నారు. పంట కోత పనులు చేపడితే దిగుబడులు లేకపోతే అదనపు పెట్టుబడులు అవుతాయని.. పంటను వదులుకోవడమే మేలు అని అభిప్రాయాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

5ఎకరాలలో పంట సాగు చేశా..

ఈ ఏడాది రబీలో 5 ఎకరాలలో నువ్వు పంట సాగు చేశా. పంట సాగు కోసం ఎకరాకు రూ.15 వేలకు పైనే పెట్టుబడి పెట్టా. సాగు చేసిన మొదలు పంటకు తెగుళ్ల సోకాయి. తెగుళ్ల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేశాను. తెగుళ్ల వీడక పంట దెబ్బతింది. దిగుబడి తగ్గడంతో నష్టాలను చవిచూస్తున్నాం.

– గంగిరెడ్డి(నువ్వు పంట రైతు), గొందిపల్లె

నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

వల్లూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు ఈవోపీఆర్‌డీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 20న దిగువపల్లె, తోల్లగంగనపల్లె గ్రామాలలో, 21న అంబవరం, నల్లపురెడ్డిపల్లె గ్రామాలలో, 22, 23 తేదీల్లో వల్లూరు, గోటూరు గ్రామాలలో, ఆధార్ కేంద్రాలు అందుబాటులో వుంటాయని తెలిపారు. ఇందులో 5 నుండి 15 సంవత్సరాల మధ్య వయసు గల వారికి ఆధార్ కార్డు జారీ చేయడం, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పుట, ఆధార్ కార్డుకు ఫోన్ నంబరును లింక్ చేయడం, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం, డాక్యుమెంట్ అప్‌లోడ్ చేయడం మొదలైనవి ఉంటాయన్నారు.